దేశమా — భర్తయా

శ్రీమతి వీరంరాజు వెంకటరమణాదేవి

చంద్రకాంత సన్నిభమైన దివ్యమందిరంపై కూర్చుని, అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నది కృష్ణపురాధీశుని కుమారిత 'రమాదేవి.' ప్రియుడు తనను వదలివెళ్ళి రెండు సంవత్సరములు గడచినవి. తన ఒంటరి ఎడారి జీవితానికి ఎప్పుడు వసంతం చేకూరుస్తాడో, తన జీవితం ఎప్పుడు నిత్యకల్యాణం పచ్చతోరణ మవుతుందో అని ఎదురుచూస్తున్నది రమ. వాలుగాలికి తెరచాపలెత్తి సాగిపోయే నౌకలాగా తమ క్రొత్త కాపురం ఎప్పుడు ప్రారంభమవుతుందా అని నిట్టూర్పులు విడుస్తున్నది. తన రాచనగరుకు వచ్చేమార్గాలన్నిటిని రోజురోజు చూసిచూసి ఆమెకళ్ళు కాయలు కాచిపోయినవి. ఈ రోజు కూడా వ్యర్థమయినట్లేనా అనుకొని లేచి ఇంట్లోకి వెళ్ళుదామనుకుంటున్నది.

ఇంతలో అల్లంత దూరంలో ఎర్రని దుమ్ము లేచింది. అటువైపు నిదానించి చూచింది కొనఆశతో రమ. గుర్రపు గిట్టల చప్పుడు వినపడ్డది. చూడగా చూడగా ఎవరో యోధుడు శరవేగంతో వస్తున్నట్లు గుర్తించింది. ఆ యవ్వనుడు సమీపిస్తున్నట్లల్ల రమాదేవికి ఆతుర్దా ఎక్కువయింది. తన ఇంటిముందు గుర్రం ఆగగనే, వచ్చింది తన ప్రేమ పెన్నిధియని గ్రహించింది. సంతోషం కట్టలు తెగింది. తన కళ్ళను తనే నమ్మలేక పోయింది. కళ్ళు నులుముకొని తన ఆకర్ణాంత నేత్రాలను పెద్దవిచేసి మళ్ళా చూసింది. అతడు తన ప్రియుడే. మహాసాగర కెరటంలాగా ఒక్క గంతులో 'బావా' అని కౌగలించుకొంది. రమ ఆనంద బాష్పాలు నదీ ప్రవాహములయి ప్రేమ సముద్రంలో కలుసుకున్నవి. ఎంతకాలం ఆ పవిత్రప్రేమ కౌగిలింతలో తన్మయత్వం చెందారో వారికే తెలియదు. పరవశత్వపు సౌఖ్యం తీరిన తరువాత సిగ్గుపడి ఇంట్లోకి గంతువేసింది బావతో.

"అమ్మా ... అమ్మా ... బావ వచ్చాడే" అని కేకలు పెడుతూ తూనిటీగలాంటి యవ్వనం తొణికిసలాడుతూ రమ చెంగుచెంగున లేడివలె గంతులుపెట్టుతూ, వంకలు తిరిగిన త్రాచువలెనున్న జడను వయ్యారంగా త్రిప్పుకుంటూ తల్లి ఒడిలో వాలింది.

"అమ్మా...లేవే...బావ ఒక్కడే కూర్చున్నాడే" అంటూ రమ తల్లిని బరబర యీడ్చుకొచ్చింది.

"అయ్యో! రమా ... ఎంత పిచ్చిదానివే. బావను అక్కడ కూర్చోపెట్టేవేమే ... ఇంట్లోకి తీసుకొనిరాలేదేం" అని మందలించింది తల్లి.

"లేదమ్మా ... బావ ఇప్పుడు చిత్తూరు యువరాజు. అందుకనే బావను అతిథి మందిరంలోవుంచి నిన్ను తీసుకొచ్చాను ... తప్పేంటే" అని సమర్థించుకుంటూ పకపక నవ్వింది.

"లే ... నాయనా లే ... ఎంతకాలానికయ్యా నీ దర్శనాలు ... ఇంట్లోకి రా ... కాళ్ళుచేతులు కడుక్కోటానికి నీళ్ళు తీసుకురావే రమా... !" అని అతనిని ఇంట్లోకి తీసికెళ్ళింది కృష్ణపురాధీశుని భార్య ముక్తాబాయి.

కాళ్ళుచేతులు శుభ్రంచేసుకొని కూర్చున్నాడు. రమాదేవి చిత్ర చిత్ర ఫలహారములతో పండ్లతో నున్న పళ్ళెరాలను తెచ్చి బావముందు పెట్టింది.

"అత్తా! మామఏడి" అని ఫలహారంచేస్తూ తలెత్తి అడిగాడు.

"ప్రొద్దుననే కమల్‌మియర్ వెళ్ళారు." వచ్చేవేళయింది.

"అంతా క్షేమమేనా"

"నాయనా! మహారాణా తమ్ముడివి. చిత్తూర్ యువరాజువి. నీకు మేము యిప్పటికైన జ్ఞాపకం వచ్చాము. అంతేచాలు. రమతప్ప అంతా కులాసాగానే వున్నాము."

"రమకేంటమ్మా"

"దానికి బావజ్వరం వస్తున్నది. ఏదో నీ ధర్మాన ఇంత ... మందిచ్చావా" అని గూఢంగా అన్నది.

"అదయితే అప్పుడే యివ్వడం అయిపోయిందిలే" అని కొంటెగా సమాధానం యిచ్చాడు.

"అరరె ... అప్పుడే మందు తీసుకున్నదన్నమాట. ఇద్దరు తోడు దొంగలే ... మధ్య నేనే పిచ్చిదాన్నయినాను"

"అమ్మా ... ఏంటీ యీ వేళాకోళాలు ... " బావవైపు చూచి, "బావా, రెండు సంవత్సరాల నుంచి ఒక్కమారైన రాలేదేం. అంత తీరనిపని ఏముందయ్యా" అన్నది తీక్ష్ణంగా.

"రమా! నీకేం తెలుస్తుందిలే ఇప్పుడు. యువరాణివైనప్పుడుగాని యువరాజు బాధ్యతలేంటో తెలియవు. ఇదివరకులాగా స్వేచ్ఛవుందనుకున్నావా? నేను యువరాజునేగాక సేనాధిపతినికూడా. మన దుర్గాన్ని ముట్టడించి, మన స్వాతంత్ర్యాన్ని హరించవలెనని సమయంకోసం కాచుకు కూచున్నాడు మొగలు జంబుకం. రాజపుత్రద్రోహి మాన్‌సింగ్ చిత్తూర్‌ను స్వాధీనంచేసుకొని తానే రాజవవలెనని పాదుషా నాశ్రయించి సమయానికై నిరీక్షిస్తున్నాడు. అందువల్ల నిరంతరంగా రక్షణ సన్నాహాలలో నిమగ్నుడ కావలసి వచ్చింది. మనం పోరాటానికి తయారుగా నున్నామని గ్రహించి అగ్బరు యుద్ధసన్నాహాలను ఆపివేశాడు. అందువల్లనే ... అన్నగారి అనుజ్ఞతీసుకొని మామను చూచిపోదామని వచ్చాను."

"అవును బావా! నాన్నగారెప్పటికప్పుడు చిత్తూర్ విషయాలు చెప్తునే వున్నారు. దేశరక్షణ ముందవశ్యకర్తవ్యంగదా!" అని మహారాణా ప్రతాప్ మరదలు కాగలుగుటకు తనకు అర్హత వున్నదని నిరూపించుకున్నది రమాదేవి.

౨

చీకటిపడగానే స్నానాదికములను పూర్తిచేసుకొని భోజనానికి తయారయ్యాడు శక్తిసింహుడు. ఇంతలో మామ కృష్ణసింహుడుకూడా వచ్చాడు. మామకెదురెళ్ళాడు శక్తిసింహుడు.

"త్రిరరే ... శక్తీ ... ఎప్పుడొచ్చావురా ... ఏంటి విశేషాలు" అని ప్రయాణబడలిక తీర్చుకోటానికి సోఫాపై కూర్చున్నాడు కృష్ణసింహుడు.

"ఒక గంటయిందివచ్చి"

"అంతా క్షేమమేనా"

"ఆ ... ఆ ... మహారాణాప్రతాప్ అండన వున్నవారికి క్షేమానికేంకొదవ." అన్నాడు శక్తిసింహుడు భ్రాతృభక్తి పూరితుడై.

"అయితే అక్బరు యుద్ధసన్నాహాలను చాలించాడటగా ... ఆఁ. అందుకే ఒకమారు చూచిపోదామని వచ్చావు ఏం ... " అని నవ్వుతూ రమవైపు చూచాడు.

అత్తగారు వెంటనే అందుకొని "మిమ్మల్ని నన్ను చూడటానికి వచ్చాడటండీ శక్తీ" అన్నది హేళనగా రమవైపుచూచి నవ్వుతూ.

"ఇక లేవండి నాన్నగారూ ... భోజనాల వేళయినది. భోంచేసి తరువాత చాలాసేపు మాట్లాడుకోవచ్చు."

అంతా భోజనాలకు లేచారు. భోజనాలు పూర్తిచేసుకొని తాంబూలం సేవించటానికి మేడపైకి వెళ్ళారు.

అంతా తివాసీలపై ఆసీనులయ్యారు. తండ్రికి బావకు తమలపాకుల ఈనెలుతీసి సున్నంరాసి మడతలుపెట్టి యిస్తున్నది రమ. బావకు తమలపాకుమడత అందిచ్చే వంకతో ఆతనిచేతినితాకి మహానంద సముద్రంలో తేలుతున్నది. శక్తిసింహుడు వెన్నెల కాంతులలో మెరిసిపోతున్న రమ సౌందర్యాన్ని తన విశాల నేత్రాలతో త్రాగివేస్తున్నాడు. పాలుతాగే పిల్లికూనలులాగా ఎవరు తమను పరికించటంలేదుగదా అని అనుకుంటున్నారు. వారిద్దరు ఒంటరిగానే వున్నామనుకున్నారు. ప్రక్కన తల్లిదండ్రులున్నారనే విషయం మరచిపోయింది రమ. అత్త మామలు వారి ఆనందాన్నిచూచి ఎంతో ముచ్చట పడ్డారు ఎవరి మనస్సులలోవారు.

"ఒరే శక్తీ" అని పిల్చేటప్పటికి త్రుళ్ళిపడ్డాడు శక్తి. ఆ లోకాన్నుంచి యీ లోకంలోకి వచ్చాడు. రమ కళ్ళు నలుపుకొని దిగ్భ్రాంతురాలై చూచింది తల్లిని. "పెండ్లెప్పుడు చెయ్యమంటావు. మా రమ ఇక ఒంటరి జీవితాన్ని గడుపలేదు" అని కొంటెగా అన్నాడు భార్యవైపుచూస్తూ తన చిన్ననాటి యవ్వన సౌఖ్యాలను ఆమెకు గుర్తుచేస్తూ. అంతా సముద్రఘోషను మించేటట్లు నవ్వారు. రమకు లేతసిగ్గు ఆవరించింది. రోమాంచమయింది. శరీరం గగుర్పొడిచింది. తలవంచుకొన్నది. కొంచం సేపటికి తల్లివడిలో వాలింది.

తండ్రి మళ్ళా అందుకొని, "అమ్మాయీ! ఎందుకే అంత సిగ్గు ... ఎప్పుడులేని బిడియం తెచ్చుకుంటున్నావేం ... ఉన్నదున్నట్లు చెప్పాను. అవునా శక్తీ ... ఏమంటావు నీవేచెప్పు."

"రాజు దలచుకుంటే దెబ్బలకేంకొదవ ... మీ యిష్టం మాభాగ్యం" అని సమాధానం యిచ్చాడు రమవైపు రెండు చేతులు చాచుతూ, సందుదొరికిందిగదా అని అవకాశంతీసుకొని.

"నాయనా! ఏదో పెంచి పెద్దవారిని చేశాము మిమ్మల్నిద్దర్ని. నీ వొకటి, మా రమ వొకటా? ఆ కాస్త మూడుముళ్ళువేసి మా నోములపంట పండించు" అన్నాడు మామ ఆనంద బాష్పాలను రాలుస్తూ.

3

శక్తిసింహుడు మామగారింట్లో నాల్గురోజులే వున్నాడు. నాల్గవరోజు సాయంత్రం రమాశక్తులు చక్కగా ముస్తాబై చేతులు చేతులు పట్టుకొని తమ విశాలభవన ఆవరణలోనున్న రాజహంసలీదే సరోవరమునకు వెళ్ళి అచ్చట గట్టుపైన కూర్చున్నారు. చంద్రోదయమయింది. శశి తన శీతల కిరణాలచే ఆ నూత్న యవ్వనులను చక్కిలిగింతలు పెట్టుచున్నాడు. శక్తి తొడమీద తలవాల్చి రమాదేవి తామరతూళ్లతో అతని చెంపపై కొడుతూ.

"బావా! రేపే వెళ్తావా. అప్పుడే ఏంతొందరయ్యా, ఎప్పుడు చెప్పల్లో ప్రయాణం పెట్టుకొని వస్తావు. ఈ రెండు సంవత్సరాలు నీ కోసం ఎదురు చూచిచూచి నా కళ్ళు కాయలు కాసినవి. పట్టుమని పదిరోజులైన వుండకపోతే ఎట్లా! మళ్ళా వెళ్ళితే, తిరిగి రాక ఎప్పుడో" అని చెమ్మగిలిన కళ్ళతో అతని చెక్కిళ్ళను తాకింది.

"రమా! ఏం చెయ్యను? దేశపరిస్థితి క్లిష్టంగానుంది కాబట్టి రాలేకపొయ్యానుగాని నీమీద కోపమా సాకు! ఉగ్గుబాలతో దేశభక్తి అలవడిన నీవే ఇట్లంటే ... " అని తల నిమురుతూ అన్నాడు.

"అదికాదు బావా ... దేశాన్ని గాలికి వదలివేసి నిన్ను నాముందు కాళ్ళుబారజాపుకొని కూర్చోమని చెప్పానా నేను. నేను నీ అర్థాంగినై ఎప్పుడు 'కార్యేషుమంత్రి' నవుతానా అనేదే నా ఆదుర్దా. ఊడగొట్టిన నాగలిలాగా నీవొక్కడవు ఎంతకాలం యీ కార్యభారాన్ని వహిస్తావు? దేశరక్షణలో నాకేం అవకాశమివ్వవా" అని తన కళ్ళను ప్రకాశింపజేసింది.

"నీవే మంటావనేగాని పులికడుపున మేక పుడుతుందా" అని ఊబకవేశాడు శక్తి రమను.

"బావా నాకొక కోర్కెవుంది. అది నీవు చెల్లిస్తావంటే చెప్పుతా. అగ్బరు ఎప్పుడైతే చిత్తూర్‌ను ముట్టడిస్తాడో ఆరోజునే మనం వివాహం చేసుకుందాము. ఆ మంగళ వస్త్రాలతోనే శస్త్రధారులమై మన సైన్యాలను శత్రువులపై వురికిద్దాము. అగ్బరుకు హైందవ వీరనారి శక్తిని చూపెట్టవలెనని వున్నది. అతనిని ముప్పతిప్పలుపెట్టి మూడుచెర్వులనీళ్ళు తాగిద్దాము. హైందవ సామ్రాజ్య స్థాపనకు మహారాణాకు అండగా నిలబడదాము. గెల్చామా రాజ్య సౌఖ్యాలు, ఓడేమా అమరమరణం, తదుపరి స్వర్గ సౌఖ్యము. చిత్తూర్ యువరాజు యువరాణు లిద్దరు ప్రేమాగ్ని కౌగిలిలో దగ్ధమయి అమరజీవులవుతారు. ఇది నీ కంగీకారమేనా శక్తీ!" అని శక్తిసింహుని భుజాలు పట్టుకొని సమాధానంకోసం ఎదురు చూచింది.

"రమా! నీలాంటి స్త్రీని భార్యగా స్వీకరించటం నాపూర్వజన్మ పుణ్యాం. నేనెంతో అదృష్టవంతుడ్ని రమా!" అంటూ ఆమెను తన కౌగిలిలోకి చేర్చుకొని పరవశత్వంలో కళ్ళు మూసుకున్నాడు.

రమ పరిష్వంగ సౌఖ్యంలోంచి తెప్పరిల్లుకొని, "బావా ... ఆలస్యమవుతున్నది ... అమ్మానాన్న మనకోసం ఎదురు చూస్తుంటారు" అని రమ ముందేలేచి తనచెయ్యి అందించి శక్తిని లేవదీసింది. అతడు లేవగనే ఒక్కచంగున అతని మెడకు తన చేతులను పెనవేసింది. అతడు ఆమె నడుము పట్టుకొని, ఆమె అతని భుజాల నాధారంచేసుకొని చిలకాగోరంకులలాగా ఆనందసాగరంలో తేలిపోతూ ఇల్లుచేరుకున్నారు.

(సశేషము)